క్లుప్తంగా

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి జఫ్రుల్లా

డోన్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించమని జిల్లా వైద్యాధికారి జఫ్రుల్లా హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కొందరు వైద్యులు, సిబ్బంది నిర్ణీత సమయం కన్నా ముందే ఇంటికి వెళ్లిపోతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ఇలాంటి సమయంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇకపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎనిర్ణీత సమయంలో తప్పనిసరిగా విధుల్లో ఉండాలన్నారు.

ఆర్టీసీ స్థలాల అద్దెకు టెండర్లు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న స్థలాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు అద్దె ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో అగ్రి కట్టర్, వాటర్ కియోస్క్‌స్టాల్,ఐస్‌క్రీమ్, బుక్ స్టాల్, ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్ షాపు, పండ్లు, పండ్ల రసాలు,సప్లయర్స్, ఐరన్, సిమెంట్, హార్డ్‌వేర్, నర్సరీ, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, ఇంటర్నెట్, జిరాక్స్, టిఫిన్ సెంటర్, తదితర వ్యాపారాలు చేసుకునేందుకు స్థలాలను అద్దెకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వ్యాపారులు టెండర్ అప్లికేషన్లు పొంది పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 18వ తేదీలోపు నంద్యాల డీపీటీఓ కార్యాలయంలో అందజేయాలని సూ చించారు. వివరాలకు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంజామల: ఆకుమల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా ఫీడర్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు గమనించి సహకరించాలని కోరారు.

అటెండర్ మృతికి నివాళి

కొలిమిగుండ్ల: మండల పరిషత్ కార్యాలయ అటెండర్ కంబగిరి రాముడు మృతదేహానికి శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ కారపాకుల నాగవేణి సంతాపం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్ష


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

డోన్ టౌన్: సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని శుక్రవారం డోన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మూర్తి, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు, నాయకులు అబ్దుల్ లతీఫ్, గోపాల్ కార్మికులకు మద్దతు తెలిపారు.

అవనీతికి పాల్పడితే చర్యలు

సంజామల: అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జనార్దన్‌రావు హెచ్చరించారు. సంజామలలో 2024–25 ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ పనులపై శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికకు ఆయన హాజరయ్యారు. అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్స్, అధికారుల నుంచి రూ.1.34 లక్షలు రికవరీకి ఆదేశించారు. కానాల గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగి చాంద్ బాషా ఉపాధి పనులకు వెళ్లి వేతనం తీసుకున్నట్లు గుర్తించారు. అలాగే ఆర్.లింగందిన్నె గ్రామానికి చెందిన ఓ రైతు పనికి రాకున్నా దొంగ సంతకాలతో వేతనం తీసుకున్నట్లు తెలిసింది. తనిఖీలో గుర్తించిన వాటిపై చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. ఎంఎస్‌డీ పీడీ భాస్కర్ నాయుడు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్స్ బాలజీ నాయక్, ఏపీడీలు శిల్పా రాణి, సాంబశివరావు, క్యాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి, ఎంపీడీఓ సాల్మన్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలే మన దేవుళ్లని.. వారు పనికి రాకుంటే ప్రాజెక్టు ఉండదని డ్వామా పీడీ జనార్దన్ రావు అన్నారు. సంజామల ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్ఆర్‌జీసీ అధికారులతో సమీక్షించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం .. కూలీలకు పని కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కూలీకి రూ.300 వచ్చేలా పని కల్పించాలని ఆదేశించారు.


డోన్‌లోని వేంకటేశ్వరస్వామి


ఆవులదొడ్డిలో కొలువైన వనం వేంకటేశ్వరస్వామి


బేతంచెర్ల: పాలుట్ల రంగనాథస్వామి


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

వైకుంఠ వైభవం

- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి
- వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారంలో వెళ్లి స్వామివారి దర్శనం

డోన్: బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అఖిలాండ బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వైష్ణవ ఆలయాల వద్ద అర్ధరాత్రి నుంచే భక్తులు వేచి వుండి స్వామివారిని దర్శించుకున్నారు. డోన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి నుంచి శుక్రవారం 12 గంటల వరకు కిలోమీటర్ మేర భక్తులు వేచివుండడం కనిపించింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాము శర్మ వైకుంఠ ఏకాదశి విశిష్టతను వివరించారు. మహిళలు ఆలయ ఆవరణలో ఉన్న తులసి, తెల్లజిల్లేడు మొక్కలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. అలాగే ఆవుదొడ్డిలోని వనం వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు బేతంచెర్ల, వెల్దుర్తి, డోన్, ప్యాపిలి, కర్నూలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

–బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేటలో తాత్కాలిక సెట్టింగ్‌లో ఏర్పాటు చేసిన వేంకటేశ్వర స్వామి ఆలయానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఇందిరమ్మ దంపతులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు. అలాగే సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చారు.

–అవుకు: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల దర్శనార్థం స్వామిఅమ్మవార్లను పల్లకీలో ఉత్తర ద్వారంలో ఉంచారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం స్వామివారిని గ్రామవీధుల్లో ఊరేగించారు.


బెలుం కోదండరామస్వామి గ్రామోత్సవం

–కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయం, బెలుం, నందిపాడు, కోటపాడు కోదండరామస్వామి ఆలయాలు, కల్వటాల, యర్రగుడి, తిమ్మనాయినపేట, చింతలాయిపల్లె తదితర గ్రామాల్లోని ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశం చేసి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బెలుంలో గ్రామోత్సవం నిర్వహించారు.

–కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి, జమ్మలమడుగు రహదారిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వేద పారాయణం, అష్టోత్తర శత నామావళి, మహా మంగళహారతి, తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులు ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు.

బేతంచెర్ల: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శివుడికి భక్తులు వేకువజాము నుంచే తరలివచ్చి పూజలు చేశారు. నంద్యాల రహదారిలోని గోపాల కృష్ణ బృందావనం, పలక చింతమాను ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. యంబాయి, ఆర్‌ఎస్‌రంగాపురం, సిమెంట్ నగర్ గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం, పాలుట్ల రంగనాథస్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


కోవెలకుంట్ల: స్వామివారి కల్యాణోత్సవం


సీతారామ లక్ష్మణ, ఆంజనేయ వేషధారణలో చిన్నారులు


డోన్: స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో వేచివున్న భక్తులు


ఆదిశేషుని అలంకారంలో మద్దిలేటి నరసింహస్వామి



కల్యాణోత్సవానికి హాజరైన అశేష భక్తజనం, మద్దిలేటిస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే కోట్ల తనయుడు

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, డోలు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ స్వామివారి కల్యాణాన్ని కనులపండుగా నిర్వహించారు. ఉదయం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డి తనయుడు రాఘవేంద్రారెడ్డి దంపతులు స్వామిఅమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


బనగానపల్లె: స్వామివారి సేవలో మంత్రి జీసీ దంపతులు


అవుకు: పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి


బనగానపల్లె: భక్తులకు ప్రసాద వితరణ


కోవెలకుంట్ల: పాండురంగస్వామి ఆలయంలో..

తెలుగు తమ్ముళ్ల మధ్య ఫ్లెక్సీ వార్..!




వివాదానికి కారణమైన ఫ్లెక్సీలు

కోవెలకుంట్ల: పట్టణంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఫ్లెక్సీ ఏర్పాటు వ్యవహారం చిచ్చురేపింది. స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణారెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి వర్గానికి చెందిన అనుచరులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఫొటోతో నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలతో కూడిన ఫ్లెక్సీని అంకాలమ్మ చౌరస్తాలోని మారెమ్మ గుడి వద్ద ఏర్పాటు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని మరో వర్గం టీడీపీ నాయకులు శుక్రవారం అక్కడ ఉన్న ఫ్లెక్సీని తొలగించి మారెమ్మ, మంత్రి దంపతుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న గడ్డం సోదరుల అనుచరులు అక్కడికి చేరుకుని రెండో వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తీసివేసి తిరిగి వారి ఫ్లెక్సీని పెట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పదిహేను రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఎలా తొలగిస్తారని గడ్డం సోదరుల అనుచరులు రెండో వర్గం నాయకులతో గొడవకు దిగారు. ఈ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు, అనుచరుల ఫొటోలతో ఇక్కడ తమ ఫ్లెక్సీ ఉండాలని అందుకే తొలగించామని, కావాలంటే వేరోచోట ఏర్పాటు చేసుకోవాలని తేల్చి చెప్పారు. దీంతో రెండు వర్గాల మధ్య మాటామాటా పెరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఫ్లెక్సీ ఏర్పాటు వ్యవహారంలో టీడీపీ నాయకులు రోడ్డెక్కి గొడవకు దిగడం చర్చనీయాంశమైంది.

జాబ్ మేళాలో 15 మందికి ఉద్యోగాలు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 15 మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమ శివారెడ్డి తెలిపారు. జాబ్ మేళాకు హరిత డెవలపర్స్, ఏపీఏఎసీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫ్యూషన్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు 34 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 15 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న ఉన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు స్పందన కరువు

డోన్ టౌన్: విద్యుత్ చార్జీల పెంపు, ఆదాయం, అవసరాలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఈ నెల 7,8 తేదీల్లో విజయవాడ నుంచి వర్చువల్ విధానంతో పాటు శుక్రవారం జిల్లా స్థాయి అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌కు వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. చేసేది లేక అధికారులే హాజరై మమా అనిపించారు. కనీసం 10 మంది కూడా హాజరుకాకపోవడం గమనార్హం. పెంచిన విద్యుత్ చార్జీలను ఎలాగూ తగ్గించరని తెలిసి జనం ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

బండలాగుడు విజేత డోన్ వృషభాలు


పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వెల్దుర్తి: మండలంలోని శ్రీరంగాపురం కొండల్లో వెలసిన పాలుట్ల రంగస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం న్యూ కేటగిరి వృషభాలకు నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. 6వేల అడుగుల దూరం బండను లాగిన డోన్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన గురునాథ్ వృషభాలు విజేతగా నిలిచి రూ.40వేలు గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా ప్యాపలి తొప్పుల శ్రీనివాసులు, ఇటిక్యాల శనపల్లి చక్రవర్తి గౌడ్ వృషభాలు సంయుక్తంగా, మిడుతూరు అలగనూరు కట్టుబడి రోలి వృషభాలు, వైఎస్సార్ జిల్లా దువ్వూరు గొల్లపల్లి వారాది రాంచరణ్ ఎద్దులు, ప్యాపిలి రంగాపురం జూటూరు చిన్నారెడ్డి, అనంతపురం పుట్లూరు అరకటివేముల సోమశేఖర్ నాయుడు వృషభాలు సంయుక్తంగా నిలిచాయి. వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేశారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

డోన్ టౌన్: ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమని.. సమయాన్ని వృథా చేసుకోకుండా బాగా చదువుకోవాలని సూచించారు. జీవితంలో స్థిరపడినప్పుడే చదువు నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు తృప్తి కలుగుతుందని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, అధ్యాపకుల నృత్యాలు అలరించాయి. అనంతరం ముఖ్య అతిథులను ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ధర్నా

కోవెలకుంట్ల: గ్రామాల్లో ఇల్లులేని పేదలను గుర్తించి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సీపీఐ నాయకుడు సంజీవులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, పక్కాగృహాలు మంజూరు చేసి రూ. 5 లక్షల హౌసింగ్ రుణం ఇవ్వాలని కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

డోన్ రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు విమర్శించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఆరు నెలలు దాటినా ఇంత వరకు దానిపై ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. మోటారాముడు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు యు.కొత్తపల్లె, మల్యాల, దేవరబండ, గుండాల గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం






బొల్లవరం నాగార్జునరెడ్డి, మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, సన్నాల జనార్దన్‌రెడ్డి, అంబటి గురివిరెడ్డి

కోవెలకుంట్ల/డోన్ టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని మండలాలకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు.ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

మండలం	అధ్యక్షుడి పేరు
బనగానపల్లి	–సన్నల జనార్దన్‌రెడ్డి
కోవెలకుంట్ల	–బొల్లవరం నాగార్జునరెడ్డి
సంజామల	– మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి
అవుకు	– కాటసాని తిరుపాల్‌రెడ్డి
కొలిమిగుండ్ల	– అంబటి గురువిరెడ్డి
డోన్	–జి. సోమేశ్వర్
మున్సిపాల్టీ	–వి. మల్లికార్జునరెడ్డి
ప్యాపిలి	–జి. కృష్ణమూర్తి
బేతంచర్ల	–కె. తిరుమలేశ్వరరెడ్డి
నగర పంచాయతీ	– షేక్ పిట్టల జాకీర్

మాజీ ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా కార్యదర్శిగా నియమితులైన అల్లె సురేష్‌రెడ్డి(తిమ్మాపురం గ్రామం) శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. దుశ్శాలువా, పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

సందడిగా ముందస్తు సంక్రాంతి



ఉట్టి కొడుతున్న విద్యార్థులు, విద్యార్థులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదిస్తున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సంక్రాంతి ముగ్గుల వలే అందరి జీవితాలు రంగులమయం కావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మానస, మనీషారాణి, నందీశ్వరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి, లెక్చరర్లు రామకృష్ణ,సత్యబాబు, నవీన్, వెంకటరమణ, ముస్తాక్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు.


ప్యాపిలి: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

బేతంచెర్ల: పట్టణంలోని శ్రీనారాయణ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గొబ్బెమ్మలు, ఉట్లోత్సవం, హరిదాసు, భోగి మంటలు ఏర్పాటు చేసి పాటలు పాడుతూ సందడి చేశారు.